# పేద బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్..!





## నేడు భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ 134వ జయంతి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 13:**
కోట్లాది భారతీయుల ఆశాజ్యోతి.... ప్రజల కోసం రాజ్యాంగాన్ని అందించిన భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ భీమ్రావు అంబేద్కర్.
భారత దేశంలో ఎన్నటికీ మరిచిపోని మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. గొప్ప సామాజిక సంస్కర్త న్యాయవేత్త, రాజకీయ నాయకుడు, రాజ్యాంగ రచయిత, సామాజిక ఉద్యమాల ద్వారా సమాజంలో న్యాయం కోసం పోరాడారు ఆయన ఆలోచనలు సమాజానికి మార్గదర్శకాలుగా నిలిచాయి. అసమాన విద్యావంతుడు, దళిత చైతన్య మూర్తి ,రాజనీతి శాస్త్ర కోవిదుడు, న్యాయ శాస్త్ర దిట్ట, పరిపాలనాదక్షుడు రచన దురంధరుడు,భారత రాజ్యాంగ నిర్మాత బహుముఖ ప్రజ్ఞావంతుడు కోట్లాది భారతీయుల ఆశాజ్యోతి. ప్రజల కోసం గొప్ప రాజ్యాంగమును అందించినటువంటి మహోన్నత శిఖరం భారతరత్న. సంపద కోసం అధికారం కోసం మనం పోరాడడం లేదు. స్వేచ్ఛ కోసం పోరాడుతున్నాం మానవ వ్యక్తిత్వ పున: సంస్కరణ కోసం పోరాడుతున్నాం. మనువాదులు ఎవరెన్ని అవరోధాలు సృష్టించిన అజన్మాంతం తన లక్ష్యాన్ని ఏనాడు వీడలేదు. పోరాటమే తన జీవిత గమ్యం అని కంకణ బద్ధులైనారు. దేశంలో ఆనాటి చీకటి రోజులలో అంటరానితనాన్ని తుద ముట్టించడంలో శిఖర సమానమయ్యాడు. అంటరాని వాడని సమాజం వెలేసిన వ్యక్తి అట్టడుగు వర్గాల ఆయుధం పీడిత వర్గాల పెన్నిధి ఒక తత్వ శాస్త్రవేత్త సంఘసంస్కర్త స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రి స్వాతంత్ర ఉద్యమ దళిత నాయకుడు, న్యాయవాది, ఆచార్యుడు, ధర్మశాస్త్ర పండితుడు, పునరుద్ధరణ కర్త ,ఎన్నో అసమానతలు వర్ణ వివక్ష నిర్మూలన కొరకు ప్రజలను విముక్తులను చేయాలని జీవితాంతమంతా పోరాడిన ఒక మహోన్నత శక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. దళిత బహుజనుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసి బాటలు వేసిన క్రాంతి కిరణం అణగారిన వర్గాల జీవితాలలో వెలుగు నింపిన వేగుచుక్క భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్.

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి తెలియని వాస్తవాలు.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తన తల్లిదండ్రులకు 14 మంది సంతానం చివరి 14 వ సంతానము డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. బాబా సాహెబ్ అంబేద్కర్ తండ్రి సుబేదార్ రాంజీ మాలోజీ సక్పాల్, తల్లి భీమా భాయ్ వీరి 14 మంది సంతానము ఉన్నప్పటికీ అందులో నలుగురు మాత్రమే బతికినట్లు తెలుస్తుంది మిగిలిన వారు అకాల మరణం చెందారు. ఇందులో తొమ్మిది మంది తోబుట్టువులు చనిపోగా మిగిలిన ముగ్గురు కుమారులు బలరాం, ఆనందరావు, భీమ్రావు, కుమార్తెలు మంజుల, తులసి, భీమ్రావు కంటే ముందు ఉన్న 13 మందిలో నలుగురు మాత్రమే జీవించారు. అంబేద్కర్ తండ్రి బ్రిటిష్ సైన్యంలో సుబేదార్ ఆ రోజుల్లోనే బాగా చదివిన వ్యక్తి కూడా కవి సంత్ కబీర్ ను అనుసరించేవారు. అయితే డాక్టర్ భీమారావు రాంజీ అంబేద్కర్ తండ్రి పదవీ విరమణ చేసినప్పుడు ఆయనకు రెండేళ్ల వయసు కూడా లేదు ఆయనకు ఆరేండ్ల వయసులోనే తల్లి బీమా భాయ్ మరణించినది. బాబాసాహెబ్ తన ప్రాథమిక విద్యను బొంబాయిలో పొందారు. భారతదేశంలో అంటరాని వ్యక్తిగా ఉండటం తీవ్ర దిగ్భాందితో గ్రహించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సతారా లో పాఠశాల విద్యను అభ్యసిస్తున్నాడు. దురదృష్టవశాత్తు అంబేద్కర్ తన తల్లిని కోల్పోయాడు ఆసమయంలో అంబేద్కర్ అత్త ఆయన బాగోగులు చూసుకుంది. తర్వాత వారు బొంబాయికి మారారు. అయితే పాఠశాల విద్య అంతట అంబేద్కర్ గారు అంటరానితనం యొక్క శాపంతో బాధపడ్డాడు. అంబేద్కర్ కు 16 సంవత్సరాల వయసులోనే 1907 సంవత్సరంలో ఒక మార్కెట్లోని బహిరంగ షెడ్డులో వివాహం జరిగినది. 1907 వ సంవత్సరంలోనే బొంబాయిలో తన మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు పై చదువులు చదవాలని తపనతో బరోడా మహారాజు శాయాజీరావు గైక్వాడ్ ఇచ్చిన 25 రూపాయల విద్యార్థి వేతనముతో 1912 వ సంవత్సరంలో బి.ఏ లో పట్టా పొందాడు. వెంటనే బరోడా సంస్థానంలో ఉద్యోగం కూడా లభించింది అయితే అంబేద్కర్ ఉద్యోగంలో చేరకుండా ఉన్నత చదువులు చదవాలని మహారాజు తో చెప్పడం ద్వారా రాజు ఒప్పుకొని చదువు పూర్తయిన తర్వాత 10 సంవత్సరాలు సంస్థానంలో పనిచేయాలని షరతులతో విదేశీ ఉన్నత విద్య చదవడానికి ఆర్థిక సహాయం చేశాడు. అప్పుడు బరోడాలో ఉన్నప్పుడు ఆయన తండ్రిని కోల్పోవడం జరిగింది. అనేక బాధలు ,ఇబ్బందులు ఎదురయ్యాయి. వాటి అన్నిటిని అధిగమిస్తూ తన లక్ష్యం కోసం ముందుకు సాగినటువంటి మహోన్నతుడు ,యోధుడు. 1913 వ సంవత్సరంలో అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లడానికి పండితుడిగా ఎంపికయ్యారు ఆయన విద్య జీవితంలో ఒక మలుపు. 1915 వ సంవత్సరంలో ఎం.ఎ., మరియు 1916 సంవత్సరంలో పీహెచ్డీ డిగ్రీ సంపాదించారు. 1917 వ సంవత్సరంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వదేశానికి తిరిగి వచ్చేసాడు అప్పటికి ఆయన వయసు 22 సంవత్సరాలు బరోడా రాజా వారు పెట్టిన షరతు ప్రకారం మిలిటరీ కార్యదర్శిగా సంస్థానంలో చేరాడు. అక్కడ కూడా కుల వివక్ష ఉండేది, అంటరాని తనము కాటేసింది. తన కింది స్థాయి ఉద్యోగులు దస్త్రాలను చేతికి అందించకుండా బల్లపై విసిరేసి అవమానించేవారు. ఆ సమయంలో కొల్లాపూర్ మహారాజు సాహు సాంఘిక దురాచారాలపై పోరాడుతున్నాడు ఆయన సహాయముతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ "మూక్ నాయక్" అనే పక్ష పత్రికను నడపసాగాడు. తదుపరి చదువుల కోసం లండన్ వెళ్లారు. అక్కడే గ్రేస్ ఇన్ ఫర్ "లా" లో ఆయనకు ప్రవేశము లభించింది. మరియు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ లో, డీ.ఎస్సీ కి సిద్ధం కావడానికి కూడా అనుమతి లభించింది. కానీ బరోడా మహారాజు సంస్థానంలో ఉన్న దివాను ఆయనను భారతదేశానికి తిరిగి రావాలని పిలిచారు. తర్వాత డాక్టర్ అంబేద్కర్ బార్ ఎట్ లా, మరియు డి.ఎస్. సి డిగ్రీల ను కూడా పొందారు. అదే విధంగా జర్మనీలోని బాన్ విశ్వవిద్యాలయంలో కూడా చదువుకున్నారు. నగరంలో కొంతకాలం ఉన్న తర్వాత తదనంతరం ముంబాయికి వెళ్లిపోవడం జరిగింది. అంటరానితనం కారణంగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు ,వేధింపుల కారణంగా అంబేద్కర్ సేవను వదిలివేయవలసి వచ్చింది. అయితే డాక్టర్ అంబేద్కర్ బొంబాయికి తిరిగి వచ్చిన తర్వాత సిడెన్ హెూమ్ కళాశాలలో రాజకీయ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ గా చేరారు, ఆయన బాగా చదువు చెప్పడం వల్ల విద్యార్థులలో బాగా ప్రాచుర్యం పొందడం జరిగింది. కానీ లండన్ లో మరలా తిరిగి చదువును ప్రారంభించడానికి అంబేద్కర్ తన పదవికి రాజీనామా చేయడం జరిగింది. ఆ సమయంలో కొల్లాపూర్ మహారాజ్ చత్రపతి సాహుజి మహారాజ్ ఆర్థిక సహాయము అందించారు. 1921 వ సంవత్సరంలో అంబేద్కర్ గారు తన థీసిస్ రాశారు. "బ్రిటిష్ ఇండియాలో ఇంపీరియల్ ఫైనాన్స్ యొక్క ప్రాంతీయ వికేంద్రీకరణ"మరియు లండన్ విశ్వవిద్యాలయం నుండి తన ఎంఎస్సీ డిగ్రీని కూడా పొందడం జరిగింది. జర్మనీలోని భాను విశ్వవిద్యాలయంలో కొంతకాలం గడిపారు. తర్వాత 1923 వ సంవత్సరంలో ఆయన డీ.ఎస్.సి డిగ్రీ కోసం తన థీసిస్ "రూపాయ సమస్య దాని మూలం మరియు పరిష్కారం" ను సమర్పించారు 1923 వ సంవత్సరంలో ఆయనను బారు కు పిలిచారు. 1924వ సంవత్సరంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇంగ్లాండ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత ఆయన అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఒక సంఘాన్ని ప్రారంభించారు. దానికి అధ్యక్షుడిగా సర్ చిమన్ లాల్ సేతల్వాడ, మరియు చైర్మన్గా డాక్టర్ అంబేద్కర్ ఉన్నారు ఈ సంఘం ద్వారా విద్యను వ్యాప్తి చేయడం ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం మరియు అణగారిన వర్గాల మనోవేదనలను ప్రతిబింబించడం అసోసియేషన్ యొక్క ప్రధాన లక్ష్యాలుగా పని చేయడం జరిగినది. కొత్త సంస్కరణల దృష్ట్యా అణగారిన వర్గాల సమస్యలను పరిష్కరించడానికి మహద్ లో అంటరాని కులాల సభ్యులతో మహాసభ నిర్వహించి ఆ ఊరి చెరువులో దళితులు కూడా నీరు తాగే విధంగా సంస్కరణ తెచ్చాడు అంబేద్కర్ 1927 వ సంవత్సరంలో ఏప్రిల్ మూడవ తేదీన బహిష్కృత భారత్ అనే వార్తా పత్రికను ప్రారంభించబడింది. ప్రస్తుతం ఉన్న సాంఘిక అసమానతలు అనేక సంఘటనలు డాక్టర్ అంబేద్కర్ రాసేవారు. అంబేద్కర్ "బాలగంగాధర్ తిలక్ ను నువ్వు దళితుడ వై పుట్టి ఉంటే స్వరాజ్యం నా జన్మ హక్కు అనే వాడివి కాదు. అంటరానితనం నిర్మూలన నా జన్మ హక్కు అనేవాడివి". అని నిర్భయంగా వార్తను రాసిన ధైర్యశాలి. ఈ అసమానత ఇలాగే కొనసాగితే అంటరాని వారికి ప్రత్యేక దేశం కావాలని ఉద్యమిస్తారు. అని ఊటంకించాడు. అంటరాని వారికి ఆలయ ప్రవేశం అనే ఉద్యమాన్ని నడిపాడు. అనేక సభలలో కుల వివక్ష అంటరానితనం పైన ప్రసంగాలు చేసేవారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎప్పుడు ఖాళీగా ఉండేవారు కాదు న్యాయవాదిగా, వాణిజ్య ఆర్థిక సలహాదారుగా, అకౌంటెంట్గా పని చేస్తూ ఉండేవారు. బొంబాయి న్యాయ కళాశాల ప్రిన్సిపల్ గా ముంబై హైకోర్టు జడ్జిగా వచ్చిన అవకాశాలను తృణపాయంగా వదిలేసినాడు అదేవిధంగా 1928 వ సంవత్సరంలో డాక్టర్ బాబాసాహెబ్ బొంబాయిలోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో ప్రొఫెసర్ అయ్యాడు జూన్ 1 1935 సంవత్సరం అదే కళాశాలకు ప్రిన్సిపల్ కూడా అయ్యాడు అయితే 1938 వ సంవత్సరంలో రాజీనామా చేసే వరకు ఆ పదవిలో కొనసాగడం అయినది. 1935 వ సంవత్సరంలో అక్టోబర్ 13 వ తేదీన నాసిక్ జిల్లాలోని యోలాలో అణగారిన వర్గాల ప్రాంతీయ సమావేశం జరిగినది ఈ సమావేశంలో ఆయన హిందువులకు ఒక షాక్ ఇచ్చారు అది ఏమిటంటే. నేను "హిందూ మతంలో పుట్టాను. కానీ నేను హిందువుగా చనిపోను." అని ప్రకటించారు. వేలాదిమంది డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అనుచరులు ఆయన నిర్ణయానికి సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరిగింది. అలాగే 1936 వ సంవత్సరంలో డాక్టర్ బాబాసాహెబ్ బొంబాయి ప్రెసిడెన్సీలో మహారు సమావేశంలో ప్రసంగించి హిందూ మతాన్ని త్యజించాలని సూచించారు. మరో ప్రక్క 1936 సంవత్సరంలో ఆగస్టు 15 వ తేదీన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అణగారిన వర్గాల ప్రయోజనాలను కాపాడటానికి ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించారు వీరిలో ఎక్కువ మంది శ్రామిక జనాభా నే ఉన్నారు. అయితే 1938 వ సంవత్సరంలో కాంగ్రెస్ అంటరాని వారి పేరులో మార్పు చేస్తూ ఒక బిల్లును ప్రవేశపెట్టింది ఆ సందర్భంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దానిని తీవ్రంగా విమర్శించారు ఆయన దృష్టిలో పేరు మార్చడము సమస్యకు పరిష్కారం కాదని ముక్కుసూటిగా చెప్పడం జరిగింది. ఆ నేపథ్యంలోనే 1942 వ సంవత్సరంలో భారత గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలికి కార్మిక సభ్యుడుగా నియమితులయ్యారు 1946 వ సంవత్సరంలో ఆయన బెంగాల్ నుండి రాజ్యాంగ సభకు ఎన్నిక కావడం జరిగినది ఆ సమయంలో ఆయన తన పుస్తకము అయిన "శూద్రులు ఎవరు"? ను ప్రచురించడం జరిగినది.

### అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ ఖ్యాతిని నిలబెట్టిన మహనీయుడు.

డాక్టర్ బాబాసాహెబ్ భీమ్రావ్ అంబేద్కర్ అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ ఖ్యాతిని నిలబెట్టిన మహనీయుడు ఆర్థికవేత్త బహుజనుల విధిరాతను తిరగరాసిన మహోన్నత క్రాంతి కిరణం. సమస్త భారతానికి దిక్సూచిగా భవిష్యత్తు ప్రయాణాన్ని సూచించిన కలియుగ ప్రత్యక్ష దైవం బాబాసాహెబ్ భీమ్రావ్ రాంజీ అంబేద్కర్ మరాఠీ గడ్డలోని రత్నగిరి జిల్లాలోని అంబవాడే అనే పట్టణము ఆనాటి సమాజం వీరిని అస్పృశ్యులుగా చిత్రీకరించినది.. చిన్నప్పటినుండే అంబేద్కర్ పురాణాలను ఇతిహాసాలను తదితర గొప్ప గ్రంథాలను చదివేవారని ,మనకు తెలుస్తుంది. గొప్ప ఆధ్యాత్మిక పాటలను కూడా గానం చేసేవారు ఆనాటి అసమానతలు సాంఘిక దురాచారాలు అప్పుడే అంబేద్కర్ గారికి అర్థం అయ్యాయి చిన్ననాటి నుండే బడిలో అగ్రకులాల విద్యార్థుల పక్కన సమానంగా కూర్చోవడానికి ఆయనకు వీలు లేకుండా పోయింది గది బయటనే కూర్చొని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినేవారు. చదువులో ఆయన చురుగ్గా ఉండేవారు. మరోవైపు ఆయన చదివే స్కూల్లో దాహం వేస్తే అగ్రకులాల వారు కొళాయిలు తిప్పితేనే నీరు త్రాగాలి ఆ సమయంలో పక్కన ఎవరూ లేకపోతే దాహంతో తిరిగి వెనక్కుకు రావాల్సిందే తప్ప కుళాయి ముట్టుకోవడానికి అర్హత లేదు. ఆ రోజుల్లో అనేక సంఘటనలు అంబేద్కర్ హృదయాన్ని తీవ్రంగా గాయపరిచాయి. ఒకసారి వేసవి సెలవులలో అంబేద్కర్ వారి మేనమామ కొడుకులు కలిసి వారి మేనమామ ఊరైన గోరేగావ్ కు వెళ్లడానికి బయలుదేరారు. కొన్ని కారణాలవల్ల వారి మేనమామ రైల్వే స్టేషన్ దగ్గరకు రాలేక పోవడంతో. వారందరూ ఒక గుర్రపు బండిని మాట్లాడుకొని గోరేగావ్ కు బయలుదేరడం జరిగింది. అయితే మార్గమధ్యంలో ఆబండివాడు వారు అంటరాని వారు అని తెలుసుకొని వెంటనే బండి దిగమని వారిపై తగువుపడ్డాడు. విపరీతమైన ఎండ చిన్నపిల్లలు సగందూరం వచ్చేసాం మమ్ములను ఊరికి చేర్చమని బతిమిలాడిన ఆమనువాది కుల అహంకారంతో ససేమీరా అన్నాడు. అయితే చివరకు రెండింతల డబ్బు ఇస్తామని చెప్పడంతో అంబేద్కర్ అన్న బండి తోలడం బండి యజమాని బండికి దూరంగా వెనక నడవడం షరతుతో ఒప్పుకొని అర్ధరాత్రి ఉరి చేరారు. అక్కడే ఒక వీధి కొళాయి దగ్గర ఆ నీటిని తాగుతున్నప్పుడు అంటరానివాడని అక్కడివారు అంబేద్కర్ పై దాడి చేసి నెట్టి వేశారు అలాంటి అసమానతలు చూసి అంబేద్కర్ గుండె రగిలిపోయింది.యుగాల తరబడి అట్టడుగు వర్గాల ప్రజలను అవమానిస్తున్నారని తెలుసుకొని రక్తము మరిగిపోయింది. ఈ అసమానతులను కూకటి వేళ్ళతో పేకలించి వేయాలని నిర్ణయించుకున్నారు. అణగారిన వర్గాల తరఫున ఒక విప్లవ వీరుడు అప్పుడే పుట్టాడు. భారతదేశ గతినిస్థితిని మార్చిన యోధుడు కుల వ్యవస్థను రూపుమాపితే గాని దేశం అభివృద్ధి చెందదని నిర్మోహమాటంగా చెప్పిన తాత్వికుడు. సామాజిక సంస్కరణలో ఈయనది ఒక చెరగని ముద్ర కోట్లాది పీడిత వర్గాల ప్రజల కోసం ఒక రగిలే నిప్పు కణం జీవితాంతమంతా రాజీలేని పోరాటమే, ఆపోరాటం తన కోసం కాదు తన జాతి జనుల స్వేచ్ఛ జీవితం కోసం సకల రుగ్మతలకు మూలమైన కుల వ్యవస్థను ధ్వంసం చేయడానికి కూకటి వేళ్లతో పెకిలించడం కోసం తన జీవిత మొత్తం శ్రమించాడు. భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్.

### స్వాతంత్ర ఉద్యమంలో, సామాజిక సంస్కరణ లో డాక్టర్ అంబేద్కర్ పాత్ర.

భారత స్వాతంత్ర ఉద్యమంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రాజకీయంగా దగ్గరవసాగాడు కొన్ని సందర్భాలలో గాంధీతో వర్ణ వివక్ష, ఆర్థిక అసమానతలపై విభేదించేవారు. లండన్ లో జరిగిన మూడు బ్రిటిష్ రౌండ్ టేబుల్ సమావేశాలకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ హాజరయ్యాడు. మొదటి రౌండ్ టేబుల్ సమావేశం 1930, రెండవ రౌండ్ టేబుల్ 1931 మూడవ రౌండ్ టేబుల్ సమావేశం 1932 జరిగినాయి పూనా ఒడంబడికతో దళిత జాతుల ప్రత్యేక నియోజకవర్గాల గురించి కొన్ని షరతులతో ఏకీభవించారు. అంతటితో ఆగకుండా దళిత జాతుల కోసం రాజకీయ పార్టీ స్థాపించి దళితులను ఏకం చేయడంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిమగ్నమయ్యారు. ఆ సందర్భంలోనే క్విట్ ఇండియా ఉద్యమం దేశ విభజనతో కూడిన స్వాతంత్రం వచ్చాయి., అప్పుడే రాజ్యాంగ పరిషత్తు సభ్యుడుగా నియమితులయ్యారు విశేషంగా శ్రమించి భారత రాజ్యాంగం నిర్మించడంలో అంబేద్కర్ గారి జీవితంలో ఒక మహాద్భుత ఘట్టం కేంద్ర మంత్రిమండలిలో మొట్టమొదట న్యాయశాఖ మంత్రిగా పదవి అలంకరించారు.తన 56 సంవత్సరాల వయసులో ఒక బ్రాహ్మణ అమ్మాయి సబితా దేవిని ద్వితీయ వివాహం చేసుకున్నారు. ఆమహానుభావుడు మొదటి భార్య రమాబాయి 1935 వ సంవత్సరంలో మరణించారు. స్వాతంత్ర్యం తర్వాత 1947 వ సంవత్సరంలో జవహర్లాల్ నెహ్రూ మొదటి మంత్రివర్గంలో తొలి న్యాయ, మరియు న్యాయశాఖ మంత్రిగా పనిచేశారు. దేశానికి రాజ్యాంగ రచన బాధ్యతలను అప్పటి ప్రభుత్వం ఆయనకు అప్పగించింది. భారత రాజ్యాంగ పరిషత్తు నియమించిన రాజ్యాంగ సంఘానికి ఆయన్ని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దృఢమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించారు. తరతరాలుగా బడుగు బలహీన వర్గాలను దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా డాక్టర్ బాబాసాహెబ్ వారి అభ్యున్నతికి రిజర్వేషన్లు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పార్లమెంటు సభ్యుడుగా ఎంపికైన తర్వాత వారసత్వ వివాహ చట్టాలలో లింగ సమానత్వాన్ని వివరించడానికి ప్రయత్నించిన "హిందూ కోడ్ బిల్లు,ముసాయిదాను"పార్లమెంటులో నిలిపివేయడంతో, కాశ్మీర్ సమస్య, భారత విదేశాంగ విధానం మరియు హిందూ కోడ్ బిల్లు పట్ల నెహ్రూ విధానంపై తన భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తూ 1951 వ సంవత్సరంలో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తర్వాత డాక్టర్ అంబేద్కర్ తన జీవితంలోని ముఖ్య అంశాలను తన ఆత్మకథ "వెయిటింగ్ ఫర్ ఏ వీసా "లో రాసుకున్నారు. భారత రాజ్యాంగ రచనకు సంబంధించి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా 1952 వ సంవత్సరంలో కొలంబియా విశ్వవిద్యాలయం ఆయనకు ఎల్ .ఎల్.డి. పట్టా ప్రదానం చేసింది. 1955 వ సంవత్సరంలో డాక్టర్ అంబేద్కర్ "థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్"అనే పుస్తకాన్ని ప్రచురించారు. అదేవిధంగా హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు జనవరి 12 వ తేదీన 1953 వ సంవత్సరంలో డాక్టరేట్ డిగ్రీ ప్రధానం చేశారు. 1954 వ సంవత్సరంలో నేపాల్ లోని ఖాట్మండులో జరిగిన బౌద్ధ మండలి లో బౌద్ధ సన్యాసులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు" బోధిసత్వ" బిరుదును ప్రధానం చేశారు ప్రత్యేకత ఏమిటంటే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవించి ఉన్నప్పుడే బోధిసత్వ బిరుదును ప్రధానం చేశారు. అలాగే 1956 వ సంవత్సరంలో అక్టోబరు 14 వ తేదీన నాగపూర్ లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధ మతమును స్వీకరించారు. ఈ దేశ చరిత్ర సంస్కృతి నా మార్పిడి వల్ల దెబ్బతినకుండా బౌద్ధాన్ని చూస్తానని చెప్పారు నిరంతర కృషితో సాగిన అంబేద్కర్ జీవనం పోరాటం ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది ఎన్నో రచనలు ఎన్నో సంఘసంస్కరణలు ప్రపంచ ఖ్యాతిగాంచిన వ్యక్తులు, వ్యవస్థలు, అంబేద్కర్ను ప్రపంచమంతా కొనియాడుతుంది. ఐక్యరాజ్యసమితి సైతం అంబేద్కర్ జయంతి వర్ధంతి లకు నివాళులు అర్పించే స్థాయికి ఎదిగారు విశ్వ జ్ఞానిగా పేరుపొందారు. ఇంతటి కీర్తి ప్రతిష్టలు గడించిన మహా మేధావి 1956.వ సంవత్సరంలో డిసెంబర్ 6.న తిరిగిరాని లోకాలకు పయనమయ్యారు. అందుకు ఆయన ఆలోచన విధానంలో దళిత బహుజనులు నడుచుకుంటూ రాజ్యాధికారం సాధించి చట్టసభలలో సొంత కాళ్ళ మీద ప్రవేశిస్తారని కోరుకుందాం.



డాక్టర్ జి. బాలస్వామి.
న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు
పూలే అంబేద్కర్ జ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు.